డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న నాచారం కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంగళవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ వినతిపత్రం అందజేశారు. హిందూ శ్మశానవాటిక పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పటేల్‌కుంట చెరువులో గుర్రపుడెక్కను తొలగించి దోమల నుంచి కాపాడాలన్నారు. హెచ్‌ఎంటీ నగర్ పెద్దచెరువుపై ఏర్పాటు చేసిన వీధిదీపాలు పనిచేసేలా చూడాలని కోరారు. దీనికి జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

గ్రేటర్ మాల మహానాడు అధ్యక్షుడిగా మహేందర్



ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ చిలుకానగర్ ప్రాంతానికి చెందిన అల్లిబిల్లి మహేందర్ మాలమహానాడు గ్రేటర్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింగ్‌రావు చేతులమీదుగా నియామకపత్రాన్ని అందజేశారు.

చర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌కు పితృ వియోగం

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాంచంద్రం తండ్రి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి నివాళుర్పించి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

మజ్జిగ వితరణ

మల్కాజిగిరి: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం మల్కాజిగిరి డివిజన్ చౌరస్తాలో జరిగింది. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నెల రోజులపాటు పంపిణీ చేస్తామని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ తెలిపారు.

మంగాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, మంగాపురం కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా సప్పిడి జ్యోతి ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో పాటు మంగళవారం ధర్మకర్తలుగా రాయిని ఉదయ్‌కుమార్, గుర్రాల ఎల్లమ్మ, అనిల్‌కుమార్, సమ్మయ్య, మల్లికార్జున్, బానూరి నవీన్‌గౌడ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ముఖ్యఅతిథులుగా హాజరై వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ఈవో వెంకట్‌రెడ్డి, ఎండోన్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు అంజయ్య, నాయకులు సీతారాంరెడ్డి, అంజిరెడ్డి, ప్రసాద్, సాయికిరణ్‌గౌడ్, భూపాల్‌రెడ్డి తదితరులున్నారు.

సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనమైన పూడూర్ గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని, మే నెలలో నిర్వహించే జాతరకు ఏర్పాట్లు పూర్తిచేయాలని గ్రామ నాయకులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పలు సమస్యలు విన్నవించి వాటిని పరిష్కరించాలని కోరారు. పలు కాలనీల్లో సీసీ రోడ్లు వేయాలని, మే నెలలో పెద్ద ఎత్తున నిర్వహించే పోచమ్మ-మైసమ్మ, దుర్గమ్మ జాతర సందర్భంగా ఆలయాల వద్ద వసతులు కల్పించాలని వివరించారు. వినతి పత్రం స్వీకరించిన ఆయన వారితో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు వేస్తామని, జాతరకు అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పోచయ్య, వెంకటేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, డప్పు క్రిష్ణ, జనార్దన్‌రెడ్డి, బక్క శేఖర్, కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల చెరువుకు మహర్దశ !

చెరువు సుందరీకరణకు అడుగులు



ఉప్పల్ నల్ల చెరువు

ఉప్పల్: ఉప్పల్ నల్ల చెరువు సుందరీకరణకు అడుగులు పడుతున్నాయి. రేపో మాపో అధికారులు లాంఛనంగా సుందరీకరణ పనులు జిల్లా మంత్రిచే శంకుస్థాపన చేయడానికి సిద్ధమవుతున్నారు. ఉప్పల్ కాల్సా ప్రాంతంలో ఉన్న నల్ల చెరువు ఇన్నాళ్లు పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల నిర్లక్ష్యానికి గురై దాదాపు 20 నుంచి 30 ఎకరాల వరకు కబ్జాల పాలైందనే ఆరోపణలు ఉన్నాయి. ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో మా పరిధి కాదని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటి వరకు కాగితాలకు పరిమితమైన విస్తీర్ణంపై అధికారులు దృష్టి సారించారు.

12 మంది పట్టాదారులు..

అసలు చెరువు విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ హద్దులు ఎలా



ఉన్నాయి. బఫర్ ఎంత ఉంది అనే వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. నల్ల చెరువులో ఇప్పటికే దాదాపుగా 12 మంది పట్టాదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారికి నోటీసులు అందించే ప్రక్రియలో ఉన్నారు. ఒక్కసారి పట్టాదారుల విషయంలో వారికి ఇచ్చే నష్టపరిహారం తేలితే పనులు మొదలు పెట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

- తొలి దశలో చెరువులోకి రోజూవారీగా వచ్చే మురుగు దారి మళ్లించి చెరువును పూర్తిగా ఎండబెడతారు. ఆ ప్రక్రియ ఇప్పటికే పూర్తైనట్లు ఇరిగేషన్ అధికారులు వివరించారు. దీంతో ఇక నుంచి చెరువులోకి వరద నీరు తప్పా.. మురుగు నీరు రాదని అధికారులు వివరిస్తున్నారు.
- మురుగుతో నిండి కలుషితమైన నల్ల చెరువును సుందరీకరణగా అభివృద్ధి చేయనున్నారు. చెరువులోకి వచ్చే మురుగు ప్రవాహాన్ని దారి మళ్లించి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు పంపే మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. కేవలం వర్షపు నీరు చెరువులోకి వచ్చేలా నాలాలను సైతం అభివృద్ధి చేయనున్నారు.

సుందరీకరణ ఇలా...

అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ మొదటి దశగా ఎఫ్‌టీఎల్‌ను ఫిక్స్ చేస్తారు. చెరువులోకి వచ్చే నీరు దారి మళ్లించి పూర్తిగా ఎండ బెడతారు. సిల్ట్‌ను సాధ్యమైనంత వరకు ఎత్తివేస్తారు. చెరువు మధ్యలో హైలాండ్ నిర్మాణం, చుట్టూ సుందరీకరణ వాకింగ్ ట్రాక్, బోటింగ్‌తో పాటు చెరువు చుట్టూ గ్రినరీని అభివృద్ధి చేయనున్నారు. అదనంగా ఆకట్టుకునే విధంగా చిల్డ్రెన్ పార్కు, రోడ్డు వైపు షాపింగ్‌మాల్స్ వచ్చే ఏర్పాటు కూడా సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



కుషాయిగూడ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కాపాడుకుందామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. జైబాపు, జైభీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ, చాకలి ఐలమ్మ బస్తీ, పాత కుషాయిగూడలో ర్యాలీ నిర్వహించి రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు గడ్డం యాదగిరి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, గోపాల్‌యాదవ్, కాంత్రి, రాజు, సుజిత్‌రెడ్డి, శ్రీనివాస్, లింగంనాయక్ తదితరులున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



అధికారులతో కలిసి పర్యటిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రూ.1.86 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు వివరించారు. ఉప్పల్ సాయిబాబాకాలనీ నుంచి సూర్యానగర్ కాలనీ వరకు బైపాస్ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పనులను ప్రారంభించామని పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత, సాయిబాబా కాలనీ అధ్యక్షుడు అంజిరెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, అంజయ్యగౌడ్, బిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం బోడుప్పల్‌లో మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్‌తో కలిసి ఆయన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. మాజీ కార్పొరేటర్ సుమన్‌నాయక్ తదితరులున్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీ రోడ్డు నెంబర్-2 లైన్‌లో రోడ్డు వేయాలని మంగళవారం కాలనీవాసులు కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని రోడ్డునెంబర్-2 లైన్‌లో నీరు నిలిచిపోవడం వల్ల కంకరరోడ్డుపై వాహనదారులు, పాదచారులు ప్రయాణించలేకపోతున్నారన్నారు. దీనికి కార్పొరేటర్ స్పందించి త్వరలో కాలనీలో పర్యటించి సమస్య పరిష్కరిస్తామన్నారు. రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సునీత, ప్రవళిక పాల్గొన్నారు.



కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

హైకోర్టు కాపీయిస్ట్ అభ్యర్థుల ఆందోళన

10 నిమిషాల పరీక్షకు 2 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నాపత్రం



అల్వాల్‌లో నిరసన చేస్తున్న అభ్యర్థులు

అల్వాల్: ప్రశ్నాపత్రాలు ఆలస్యంగా ఇవ్వడంతో పరీక్ష ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉందని, ఆరోపిస్తూ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. తెలంగాణ హైకోర్టులో కాపీయిస్ట్ ఉద్యోగాల కోసం మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల్లో అల్వాల్‌లోని అయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో 10 నిమిషాల టైపింగ్ పరీక్షకు 2 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నాపత్రం ఇవ్వడంపై అభ్యర్థులు పూర్తిస్థాయిలో టైపింగ్ చేయలేకపోయామని, పరీక్ష కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. సుమారు 300 మంది హాజరైన ఈ కేంద్రంలో మంగళవారం ఉదయం 9 గంటలకు పరీక్షకు హాజరై విద్యార్థులకు 30 నిమిషాలు మాక్ టెస్ట్ అనంతరం 5 నిమిషాల విరామం ఇచ్చి మరో 5 నిమిషాల పాటు నియమనిబంధనలు తెలియచేయాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే ప్రశ్నాపత్రం ఇవ్వాల్సి ఉండగా.. పది నిమిషాలు పరీక్ష రాయాల్సిన సమయంలోనే ప్రశ్నాపత్రం ఇవ్వడంతో అభ్యర్థులందరికీ చేరవేయడంలో ఆలస్యమైందని అభ్యర్థులు ఆందోళన చేశారు. కొందరికి నిమిషం, మరికొందరికి 2 నిమిషాల పాటు ఆలస్యం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరీక్షను తిరిగి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద ఎత్తున అభ్యర్థులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకుని అభ్యర్థులకు నచ్చజెప్పారు.

అసోసియేషన్ల సహకారంతోనే నేరాల అదుపు



మాట్లాడుతున్న ఎస్సై కోటేశ్వర్‌రావు

ఉప్పల్: సంక్షేమ సంఘాలు, కాలనీ అసోసియేషన్లతోనే నేరాలను అదుపు చేయొచ్చని ఉప్పల్ అడ్మిన్ ఎస్సై కోటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం చిలుకానగర్ డివిజన్ బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో కాలనీవాసులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. నేరాల అదుపు కేవలం పోలీసులతోనే కాదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే నేరాల అదుపు సాధ్య పడుతుందన్నారు. బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఓంకార్‌సింగ్, వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక మహిళలు తదితరులున్నారు.

రూ.39.50 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: జ్యోతినగర్‌లో రూ.39.50 లక్షలతో సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ సునీతారాముయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో సీసీరోడ్లు, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కాలనీలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, జ్యోతినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నేతలు తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్ కాలనీలోని శాంతి అపార్ట్‌మెంట్ లైన్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ.ఫరీద్, నాయకులు నాగరాజు, మోహన్‌రాజు, శ్రీరామ్‌యాదవ్, నవీన్, రాము, ప్రభాకర్, సాయి, మనోజ్, శంకర్, విక్కీ, సత్యనారాయణ, రాజు, ఇస్తారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

పౌష్టికాహార కిట్ల పంపిణీ



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న వైద్యశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజేశం, ఉమాగౌరీ

ఉప్పల్: ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ కార్యక్రమంలో భాగంగా ప్లాన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వైద్యశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజేశం, జిల్లా వైద్యాధికారి డా.ఉమా గౌరీలు హాజరై టీబీ రోగులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబీ సోకిన వారు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. శరీర రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత కంటే రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.సత్యవతి, డాక్టర్ శ్రీదేవి, ఉప్పల్ వైద్యాధికారి కేంద్రం డా.సౌశీల్య, భోగ ప్రకాష్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, వాసు ప్రసాద్, వేంకటేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

స్లాట్ రిజిస్ట్రేషన్ విధానం రద్దు చేయాలి



ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

ఘట్‌కేసర్: ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్లాట్ రిజిస్ట్రేషన్ విధానం సరైంది కాదని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దస్తావేజుల తయారీ నిలిపివేసి సబ్‌రిజిస్ట్రార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్లాట్ బుకింగ్‌తో వేలాది మంది డాక్యుమెంట్ రైటర్లు జీవనోపాధి కోల్పోతారని అన్నారు. నూతన స్లాట్ విధానం రద్దు చేసి పాత విధానం అమలు చేయాలని, పాత విధానంతో వేలాది మంది స్వయం ఉపాధి పొందుతున్నామని తెలిపారు. స్పందించకపోతే తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నరేశ్‌గౌడ్, రాజేశ్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, సుధాకర్, లక్ష్మణ్‌చారి, కృష్ణకుమార్, మహేశ్, అనిల్, ఆర్.నరేశ్, యూనిస్, సునీల్, మహేశ్, శివరెడ్డి, శ్రవణ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇనుప రాడ్‌తో దాడి చేసిన నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిని ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ కూలర్ కంపెనీలో పని చేసే రియాజుద్దీన్‌తో ముగ్గురు స్నేహితులు మహమ్మద్ తాబరేజ్, ఇక్లాక్, ప్రకాశ్‌రామ్ మధ్య నెల రోజుల క్రితం గొడవ జరిగింది. పాత కక్షలతో ముగ్గురు కలిసి ఆదివారం రాత్రి రియాజుద్దీన్‌పై ఇనుప రాడ్‌తో దాడి చేశారు. గాయాలైన అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

'రాజీవ్ యువ వికాసం'కు దరఖాస్తుల వెల్లువ

మల్కాజిగిరి: రాజీవ్ యువ వికాసంకు మల్కాజిగిరి సర్కిల్‌లో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 14 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువు ముగిసింది. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో ఆన్‌లైన్ దరఖాస్తు అప్లికేషన్‌తో పాటు ఇతర ధ్రువీకరణపత్రాలను ప్రాజెక్ట్ విభాగంలో పలువురు అందజేశారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల ద్వారా సుమారు 2765 దరఖాస్తులు అందాయని ప్రాజెక్ట్ అధికారి మల్లికార్జున్ తెలిపారు. ఎస్సీ విభాగంలో 748, ఎస్టీ విభాగంలో 59, అత్యధికంగా బీసీ విభాగంలో 1530, మైనారిటీ విభాగం నుంచి 297, ఈబీఎస్/ఈడబ్ల్యూఎస్ విభాగంలో 131 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

ఇంట్లో గొడవపడి మహిళ అదృశ్యం



నరసమ్మ

మల్కాజిగిరి: ఇంట్లో గొడవపడి మహిళ అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జేఎల్‌ఎస్‌నగర్‌కు చెందిన మందిగ నరసమ్మ (49) గృహిణి. కాగా ఈనెల 14న తన ఇద్దరు కుమారులతో గొడవపడింది. కాగా అదేరోజు ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఆమె కుమారుడు నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవితకు భరోసా పాలిటెక్నిక్ కోర్సులు

• సత్వర ఉద్యోగ, ఉపాధి అవకాశాలు • పాలిసెట్ పరీక్షల జిల్లా కో- ఆర్డినేటర్ వినయ్‌కుమార్



అధికే వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్

రామంతాపూర్ : పదోతరగతి పూర్తికాగానే అతి తక్కువ కాలంలోనే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలనుకునే వారికి పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ అగ్రి కల్చరల్ డిప్లొమా కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తున్నాయి.

వచ్చేనెల 13న ప్రవేశాలు..

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు ప్రవేశాలకు పాలీసెట్ పరీక్ష మే నెల 13న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో డిప్లొమా కోర్సులు ప్రవేశ విధానం ఉపాధి, ఉద్యోగ మార్గాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మేడ్చల్ జిల్లా పాలీసెట్ పరీక్షల నిర్వహణ కో-ఆర్డినేటర్ రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్‌తో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..

సాక్షి : పాలిటెక్నిక్ విద్య అంటే ఏమిటీ.. వివరిస్తారా ?

ప్రిన్సిపాల్ : పాలిటెక్నిక్ విద్య వివిధ డిప్లొమా కోర్సులతో కూడిన సాంకేతిక విద్య అందించేదే పాలిటెక్నిక్. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్ కోసం మరో రెండేళ్లు చదివే లోగా విద్యార్థులు ఈ కోర్సులు పూర్తిచేసి నిర్దిష్టమైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని త్వరగా ఉద్యోగాలు సంపాదించుకుని కేరీర్‌ను మొదలుపెడతారు.

సాక్షి : టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులు ఉన్నాయా ?



రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ప్రిన్సిపాల్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు కల్పించే సాంకేతికతతో కూడిన ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులే కాకుండా నాన్ టెక్నికల్ కోర్సులైన అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్ ఫార్మసీ కోర్సులు కూడా ఉన్నాయి.

సాక్షి : ఈ కోర్సుల వ్యవధి ఎన్నేళ్లు ?

ప్రిన్సిపాల్: ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల వ్యవధి మూడున్నరేళ్లు. నాన్ టెక్నికల్ కోర్సులైన అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, సెరికల్చర్ వంటి కోర్సులు మూడేళ్లు ఉంటాయి.

సాక్షి :పాలిటెక్నిక్ కోర్సుల్లో నచ్చిన డిప్లొమా కోర్సును ఏ విధంగా పొందవచ్చు ?

ప్రిన్సిపాల్ : వచ్చేనెల 13న నిర్వహించే పాలీసెట్ ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా నచ్చిన కోర్సును మంచి కళాశాలను ఎన్నుకోవచ్చు.

సాక్షి : రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమాలో ఎలాంటి కోర్సులు ఉన్నాయి ?



పాలిటెక్నిక్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

ప్రిన్సిపాల్ : రాష్ట్రంలోనే అతి పెద్దదైన రామంతాపూర్‌లోని ప్రభుత్వ జవహర్ లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జికల్, కెమికల్, డిప్లొమా పోస్టులతో పాటు దక్షిణ భారతదేశంలోనరే ఏ పాలిటెక్నిక్ కళాశాలలో లేని అరుదైన ప్యాకెజింగ్ టెక్నాలజీ కోర్సు కూడా ఉంది.

సాక్షి : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉన్నత విద్యావకాశాలు ఉంటాయా ?

ప్రిన్సిపాల్ : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉన్నత విద్యావకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు ఉత్తీర్ణులైన వారికి ఈసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో ర్యాంకు ఆధారంగా లేటర్ విధానంలో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలోకి ప్రవేశం కల్పిస్తారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్ డిప్లొమా పూర్తి చేసుకున్న వారు ఆయా విభాగాల్లో డిగ్రీస్థాయి కోర్సుల్లో లెటర్ విధానంలో డీఎస్సీ అగ్రికల్చర్‌లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు.